విశాలాంధ్ర అనకాపల్లి
పేజి నెం. 6
గురువారం 4, జులై, 2024

అల్లూరి జయంతికి ముమ్మర ఏర్పాట్లు

విశాలాంధ్ర - గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని గురువారం అల్లూరి నందనవనంలో ఏ.ఎల్.పురం పంచాయతీ సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహనీయులు అల్లూరి స్మారక మందిరం ఈ ప్రాంతంలో ఉండటం తమ అదృష్టమన్నారు. వాటి కారణంగానే తమ ప్రాంతా నికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు వచ్చిందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ సంకల్ప కోఆర్డినేటర్ వి.మాధవ్, అల్లూరి నందనవనం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల ప్రాణాలతో చెలగాటం

ప్రైవేటు పాఠశాలలపై కానరాని పర్యవేక్షణ
బుచ్చయ్యపేట జాజి మొగ్గల స్కూల్ నిర్వాకం

సామాన్యులకు విద్య అందని ద్రాక్షగా మారింది. నాణ్యమైన విద్య పేరిట ప్రైవేటు పాఠశాలలు విచ్చల విడిగా దందా చేస్తున్నారు. పేద మధ్యతరగతి పిల్లల తల్లిదండ్రులు వారి సంపాదన పాఠశాల ఫీజులకు సరిపోవటం లేదు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ప్రైవేటు పాఠశాలలకు వివిధ రకాల పేర్లు పెట్టి, రంగు రంగుల కరపత్రాలు, హోర్డింగులు, బోర్డులు, ఫ్లెక్సీలతో విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తూ పేద ప్రజలను ఆకట్టుకుంటున్నారు. విద్యతో పాటు, పాఠశాలలో ఫీజులు, బట్టలు, బూట్లు, టై, బెల్టు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌ల పేరిట అధిక ధరలకు విక్ర యిస్తూ వ్యాపారం చేస్తున్నారని కొందరి తల్లితండ్రుల ఆవేదన.

విశాలాంధ్ర - బుచ్చియ్యపేట: మండలంలో విద్యాశాఖ కార్యాలయానికి సమీపంలో ఉన్న జాజి మొగ్గల స్కూల్ యాజమాన్యం స్కూల్లో చదువుతున్న విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. వీటితోపాటు ఆటో ఫీజు, ఇతర రకాల ఫీజులతో ప్రజలందరిపై మాయమాటలు చెప్పి తర్వాత, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తూ కార్పొరేట్ స్థాయిలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యా వ్యాపారం చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై మండల విద్యా శాఖాధికారులు ప్రైవేటు పాఠశాలలు ఇచ్చే మామూళ్ల మత్తులో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అన్నీ కలిపి ప్రైవేటు పాఠశాలల్లో ఎల్కేజీ విద్యార్థులకు రూ.30 వేల నుండి రూ.40 వేల పైగా సామాన్య ప్రజలు ఫీజులు చెల్లించాల్సి వస్తుంది. పాఠశాలలో ఎక్కడా మౌలిక వసతులు లేకపోయి నప్పటికీ, ఫీజులు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నప్పటికీ పట్టించుకున్న వారే లేరు. ప్రభుత్వం ఒకే ఫీజు విధానాన్ని తీసుకురావాలని, అధిక ఫీజుల దందాలు అరికట్టాలని, అనుమతులు లేని పాఠశాలలపై, అర్హత లేని ఉపాధ్యాయులతో నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం శూన్యం. విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక్కో ఆటోకి సుమారు 20 మంది పిల్లలను ఎక్కించి ఆటోలో వెనక వైపు పక్క వైపు వేలాడుతూ స్కూల్ బ్యాగులపైన కూర్చోబెడుతూ పిల్లలను తరలిస్తున్నారు. మండలంలో రోడ్లు పరిస్థితి బాగోకపోవడంతో సాధారణ ప్రయాణికులే తీవ్ర ఇబ్బంది పడుతున్న తరుణంలో చిన్నపిల్లలు ఈ విధమైన ప్రయాణం చేస్తే ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యత స్కూల్ యాజమాన్యానిదా ప్రభుత్వానిదా అధికారులుదా అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జరిగిన నష్టానికి వాళ్ల తల్లిదండ్రులకు ఎవరు సమాధానం చెప్పగలరు.. ఇటువంటి పరిస్థితుల్లో స్కూల్ సిబ్బంది గాని అధికారులు కానీ పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్య వైఖరి పిల్లల పట్ల వారు చేస్తున్న వ్యవహారానికి చర్యలు తీసుకోరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతి ప్రైవేట్ స్కూల్లో ఫీజు వివరాలతోపాటు బస్సులో విద్యార్థుల పూర్తిరక్షణకు రోడ్‌సైడ్ పాఠశాలలు తప్పనిసరిగా రోడ్డుపై జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేసుకోవాలని, పాఠశాలల్లో తప్పనిసరిగా అగ్నిమాపక భద్రతా చర్యలు తీసుకోవడం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను పాఠ్య ప్రణాళికలో భాగం చేయడం పాఠశాల భవనాలు పూర్తి భద్రతతో ఉండాలని, ఓపెన్ కారిడార్ ఉన్న అంతస్తుల్లో గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిబంధన ఉన్నప్పటికీ అవి మండలంలో ఉన్న స్కూల్స్‌లో కానరాకపోవడం కొసమెరుపు.

భద్రంగా అందించిన సామాజిక భద్రతా పింఛన్లు

విశాలాంధ్ర - కె.కోటపాడు: సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ సంపూర్ణంగా జరిగిందని 99.34% ఆయా ఇళ్ల వద్ద నగదు అందించగా మిగిలిన వారికి అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో ఉన్న వారికి పంపిణీ చేయడం జరిగిందని స్థానిక ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఎంతో బాధ్యతాయుతంగా ఎక్కడ ఎటువంటి అవాంతరాలు లేకుండా పంపిణీ చేశారని అన్నారు. మండలంలో 11002 పెన్షన్లు ఉండగా, ఇళ్ల వద్ద 10929 పెన్షన్లు ఒకే రోజున అందించారని అన్నారు. మిగిలిన వారు బెడ్ పేషెంట్లుగా వివిధ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారని కొందరు ఉద్యోగులు అక్కడికి వెళ్లి స్వయంగా వారికి అందించడం జరిగిందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి పంపిణీ చేసిన ఉద్యోగులను ఎంపీడీవో అభినందించారు.

జనసేనలో చేరిన శ్రీరామమూర్తి

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని ఎల్లిపట్నం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ సిరిని వైస్ చైర్మన్ పోతల శ్రీరామమూర్తి జనసేన పార్టీ మాడుగుల నియోజక వర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. శ్రీరామమూర్తికి పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ మరింత బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యర్ల ప్రసాద్, కశింకోట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

10న కోర్కెల దినం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నక్కపల్లి: కేంద్రం, రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వాలు స్కీమ్ వర్కర్లు, కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 10న సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు తెలిపారు. నూకాలమ్మ గుడి ఆవరణలో సీఐటీయూ నక్కపల్లి మండలం సమన్వయ కమిటీ సమావేశం ఎం.దుర్గా రాణి అధ్యక్షతన జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ వీళ్ల తరఫున విరు ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు అంగన్వాడీ, ఆశా, వీవోఏ, మిడ్ డే మీల్, పంచాయతీ తదితర కార్మికుల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వాలు అయినా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా కార్మిక అనుకూల విధానాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.రాజేష్, రమణమ్మ, నారాయణరావు, సత్యనారాయణ, వరలక్ష్మి, కృష్ణవేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం: ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: గంజాయి అక్రమ రవాణా ఇతర డ్రగ్స్ నివారణకు 100 రోజుల ప్రత్యేక కార్యచరణలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గంజాయి కేసులను సమీక్షించి దర్యాప్తు అధికారులకు జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచనలు చేశారు. ఆంధ్ర ఒడిషా బోర్డర్ ఏజెన్సీ ప్రాంతం నుండి రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన కేసులను సమీక్షించి దర్యాప్తు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దర్యాప్తు అధికారులు గంజాయి కేసులను ప్రత్యేక శ్రద్ధ వహించి నేరాభియోగ పత్రాలను సంబంధిత కోర్టులో నమోదు చేయాలని, కేసులలో పురోగతిపై ఎ.పి.ఐ తో అనుసంధానంతో సదరు కేసులలో శిక్షలు పడేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ్ మూర్తి, గణేష్, కుమారస్వామి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ తపాల ఉద్యోగులపై టార్గెట్లు నిలిపివేయాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: గ్రామీణ తపాలా ఉద్యోగులపై పోస్టల్ డిపార్ట్మెంట్ విధిస్తున్న టార్గెట్లు నిలిపివేయాలని అనకాపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆల్ ఇండియా డాక్ సేవక్ యూనియన్ (ఏఐటీయుసి అనుబంధం) ఆధ్వర్యంలో కేంద్ర యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా నిర్వహించిన ధర్నాలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.దుర్గాప్రకాష్ మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో సంస్థకు అత్యధిక సంపద సృష్టించే జీడిఎస్‌ల మీద ప్రతిరోజు టార్గెట్లు విధిస్తూ మానసికంగా శారీరకంగా వేధిస్తున్న డిపార్ట్మెంట్ అధికారుల వైఖరి సరికాదన్నారు, వీరి కారణంగానే గ్రామీణ తపాల కార్మికులు రోగాల బారిన పడి చనిపోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. రోజుకు నాలుగు గంటలు పనివేయాలని జీడిఎస్‌ల చేత ఎనిమిది నుండి 10:00 గంటలు పనిచేస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్నారని, అంతకుమించి టార్గెట్లు విధించి మానసిక వేధింపులకు గురిచేయడం వల్ల అకాల మరణాలు చెందాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టార్గెట్ వేధింపులు మానుకొంటే జీడిఎస్‌లను పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీ యూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు వైఎన్ భద్రం మాట్లాడుతూ సంస్థకు సంపద సృష్టి కర్తలైన జీడీఎస్‌పై వేధింపులు నిలిపివేయాలని లేకుంటే వారి తరఫున ఏఐటీయూసీ ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎస్.సతీష్ కుమార్, కోశాధికారి వి.నూకరాజు దొర, ఎం.నాగేశ్వర, కే.మధు, గంగరాజు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంజయ్ పాండాకు వినతిపత్రం అందజేశారు.

విశాఖ పోర్టును సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్టడీ టూర్‌లో భాగంగా ఆరుగురు సభ్యుల ట్రైనీ ఐఏఎస్ బృందం గురువారం విశాఖపట్నం పోర్టును బుధవారం సందర్శించారు. పోర్టు డెప్యూటీ చైర్ పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి సాదర స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న కార్యకలాపాలు, మౌలిక వసతులు, ఎగుమతులు దిగుమతులు, సరుకు రవాణాలో చేపడుతున్న పద్ధతులు, పోర్టు ఆధునీకరణ, యాంత్రీకరణ, పచ్చదనం పెంపొందించేందుకు చేపడుతున్న చర్యలు, కవర్డ్ స్టోరేజ్ యార్డ్‌ల నిర్మాణం, సోలార్ పవర్, నీటి శుద్ధి ప్లాంట్ వంటి అనేక అంశాలను డెప్యూటీచైర్ పర్సన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రైనీ బృందానికి వివరించారు. పోర్టులో జరుగుతున్న కార్యకలాపాలను తెలియజేసిన డెప్యూటీ చైర్ పర్సన్, పోర్టు ఉన్నతాధికారులకు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో పోర్టు విభాగాధిపతులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు అల్లూరి చిత్రకళా మందిరం ప్రారంభం

విశాలాంధ్ర - గొలుగొండ: జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో కృష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కులో శాశ్వతంగా ఏర్పాటు చేసిన అల్లూరి చిత్రకళ మందిరాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆవిష్కరిస్తారని, అందుకు సర్వం సిద్ధం చేసినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. ముఖ్య అతిథులుగా అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.ఎం.రమేష్, గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పలువురు ప్రభుత్వ అధికారులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ 18 మంది ప్రముఖ చిత్రకారులు అల్లూరి చరిత్రకు సంబంధించిన కళాఖండాలను చిత్రించడం జరిగిందని, వీటివల్ల పౌరుషు వస్తున్న సందర్శకులకు పరిశీలనకు, విద్యార్థుల పరిశోధనకు దోహదపడతాయని పడాల వీరభద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్య దర్శులు శ్యామల వరలక్ష్మి, పల్లా భాస్కరుడు, అంబటి వరహాల రాజు, లక్కాకుల బాబ్జి, మాదేటి రాజాజీ, మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవి ప్రకాష్, అల్లూరి సీతారామరాజు మనవడు అల్లూరి శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పాల్మాన్‌పేట, రాజయ్యపేట ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన స్కూల్ కిట్స్ పంపిణీ చేశారు. పాత శాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో ఈ విషయాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లినట్లు టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెదిరెడ్డి నాగ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైలపల్లి అశోక్ చక్రవర్తి, పిల్ల గోవింద్, కొండబాబు పాల్గొన్నారు.

పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సీఐ వి.అప్పలరాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద, మంగవరం రోడ్ జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలలో, గ్రామ కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా కేసులను ఛేదించేందుకు సులువు అవుతుందని తెలిపారు.

గణిత పోటీల్లో ఉపాధ్యాయులు నాగూర్‌కు తృతీయ స్థానం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయులకు గణితంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని గుంటపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు షేక్ నాగూర్‌కు తృతీయ స్థానం లభించింది. గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన పోటీలకు సంబంధించి బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటలక్ష్మి చేతుల మీదుగా నాగూర్ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా నాగూర్‌ను డీఈఓ ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామారావు ప్రోత్సాహంతో తాను బహుమతి సాధించినట్లు షేక్ నాగూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, రాంగోపాల్ పాల్గొన్నారు.

గొల్లగుంటలో తాగునీటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - పరవాడ: మండలంలోని రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గత కొద్ది రోజులుగా స్థానికులు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'గొల్లగుంటలో దాహం కేకలు' అనే శీర్షికతో బుధవారం విశాలాంధ్ర దినపత్రికలో కథనం వెలువడింది. స్పందించిన పంచాయతీ విస్తరణాధికారి రమేష్‌నాయుడు కార్యదర్శి, సర్పంచ్‌తో కలిసి మరమ్మతులకు గురైన బోర్ పంపు మోటార్‌ను పరిశీలించారు. అనంతరం సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టారు. కాలిపోయిన మోటార్‌ను బోర్ నుండి బయటకు తీసి కొత్తమోటారును బిగించారు. సాయంత్రంలోగా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. అప్పటి వరకు గ్రామంలో ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని రమేష్‌నాయుడు తెలిపారు..

బోర్ పంపు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం